# ఆనందరావు

-సిహెచ్.డి.లక్ష్మణరావు

ఆనందరావుది రాగాలపురం ఊరు. ఆ వూరిలో అందరూ అతడిని పూర్వజన్మలో పెట్టి పుట్టావంటారు. ఎందుకంటే నాలుగు ఇళ్లకి యజమాని. వచ్చిన ఇంటి అద్దెలతో కాలక్షేపం చేయడమే. దగ్గరి సంబంధం. మామగారిచ్చిన ఆస్తిని అనుభవించడమే. పెళ్లయి పదిహేనేళ్లయినా పిల్లాపీచూ లేరు. ఆనందరావుకి భార్య వలన అదృష్టమేగానీ ఇతడు మాత్రం ఐరన్‌లెగ్గే. ఈ మాటలు కూడా లోకులవే.

ఆనందరావు దేనిలో చేయిపెట్టినా కాలడమేతప్ప కలసిరాదు. అలా అని ప్రతీ పనిలో దూరకమానడు. ఊసుపోక ఏవో డైలాగు పుస్తకాలు తెచ్చుకుని ఇంట్లో అద్దం ముందు కూర్చుని డైలాగులు దంచేస్తాడు. రోజులాగే ఆ రోజు కూడా డైలాగుల పుస్తకం పట్టుకుని అద్దం ముందు కూర్చుని ఏకధాటిగా చదువుతున్నాడు.

"ఏమిరా వాగుడు?''

"ఆగలాగా... నెత్తిమీద వెంట్రుక కూడా పీకలేవు. కళ్ళెర్రజేస్తే కాలిపోతాననుకున్నావా? నో...నెవ్వర్. రాజుకున్న అగ్గిని ఆర్పటమూ, గట్టు తెగిన చెరువుని ఆపటమూ అంత సులువు కాదు. ఖబడ్దార్.''

"సెప్తే యిన్నావా? వూరుకున్నోడు వూసెత్తకురా అని మా తాత సెపుతుండేవాడు. తిన్నగా నేకపోతే తలకు సుట్టిన తలపాగా కూడా తిరగబడుద్దంటే ఇదే''

"తెల్చుకున్నోడివి నువ్వయితే తెగించిన వాణ్ని నేను.''

ఇలా విలన్ డైలాగులు, హీరో డైలాగులు ఏకబిగిన చెప్పేస్తున్నాడు ఆనందరావు.

ఆ రోజే వచ్చిన మావగారు పక్క గదిలో పడుకున్నారు.

ఆనందరావు ఆవేశపూరిత డైలాగులకి ఉలిక్కిపడి లేచారాయన.

"అల్లుడూ! ఇలా కంఠస్వరం ఉత్తినే పాడు చేసుకోవడమెందుకు? ఏ నాటకాల్లోనో ప్రయత్నించు. అలా వీధిలోకి వెళితే నీ టాలెంట్ గుర్తించకపోరు'' మామగారి మాటలు ఎంకరేజ్‌గా అనిపించాయి.

ఆనందరావుకి పట్టుదల పెరిగింది. ఆనందరావు వీధిలో పడ్డాడు.

అప్పుడే ఒకతను స్కూటర్ తాళం తీయలేక అవస్థ పడుతున్నాడు.

ఆనందరావు హీరోలా ఎంటరయి "ఏం తాళం తీయలేకపోతున్నావా?'' గంభీరంగా అడిగి ఆ తాళాన్ని అటూ ఇటూ తిప్పి స్కూటర్ స్టార్ట్ చేసి అతడికిచ్చాడు. ఆ వ్యక్తి థాంక్స్ చెబుతాడేమోనని ఎదురు చూసాడు.

ఆ వ్యక్తి థాంక్స్ కూడా చెప్పకుండా స్పీడుగా లాగించేసాడు.

ఇంతలో మరో వ్యక్తి వచ్చి "నా స్కూటర్ అతనికి ఇచ్చారేంటి?'' అడిగాడు.

"మీదా? అతనిదన్నాడు'' ఆశ్చర్యపోవడం ఆనందరావు వంతయింది.

"మీరిద్దరూ తోడుదొంగల్లా ఉన్నారు. ఇదిగో నా స్కూటర్ కాగితాలు'' బ్యాగ్‌లో నుండి తీసి చూపించాడా వ్యక్తి.

తగాదా పెద్దదయింది.

"పదండి పోలీస్‌స్టేషన్‌కు'' అన్నాడా వ్యక్తి.

"అంతవరకు ఎందుకులెండి. మా మామగారు పరిష్కారం చేస్తారు. మా ఇంటికి రండి'' అన్నాడు.

ఇల్లు చేరారు. విషయమంతా మామగారికి వివరించాడు.

"బయటకు వెళ్లి నువ్వు చేసిన నిర్వాకం బాగుంది అల్లుడూ. ఎవరే పని చేయాలో ఆ పని చేయాలి. నువ్వేమైనా హీరోననుకుంటున్నావా?'' అంటూ చెడామడా దులిపేసి ఆ వ్యక్తి వద్ద కాగితాలు పరిశీలించి 'పాత మోడల్ కదా' అని ఆరువేల రూపాయలు రేటు కట్టి తగాదా పరిష్కరించుకున్నారు.

"అల్లుడూ! హాయిగా ఇకనుండి ఇంట్లోనే ఉండు. నా కూతురు ఎలా వేగుతోందో ఏమిటో?'' మనసులో ఎంతో బాధపడుతూ ఎన్నో జాగ్రత్తలు నూరిపోసి మామగారు పయనమయ్యారు వాళ్లింటికి.

నీరజకి భర్తంటే పరమ భక్తి. పల్లెత్తు మాట అనదు, అననివ్వదు.

***

ఆ రాగాలపురంలో అనేక నాటక సమాజాలున్నాయి.

ఎన్ని ఉన్నా చైతన్య నాటక సమాజం, స్ఫూర్తి నాటక సమాజం పేరు పొందినవి.

ఏ పరిషత్తు పోటీలో పాల్గొన్నా ఈ రెండు నాటక సమాజాలవారికి తప్పనిసరిగా బహుమతులు వచ్చేవి.

రోజులు గడుస్తున్నకొద్దీ చైతన్య నాటక సమాజంలో కొత్తవారు చోటు చేసుకోవడంతో పోటీల్లో వెనుకబడింది.

స్ఫూర్తి నాటక సమాజం బహుమతులతోపాటు ఊరి ప్రశంసలు కూడా పొందారు. అంత కృషి చేస్తున్నారు మరి.

చైతన్య నాటక సమాజం వారి తీరు మారింది.

స్వార్థం పెరిగింది. ఆలోచనా సరళి అడ్డదారులు తొక్కింది. రాబోయే పరిషత్తు పోటీల్లో

స్ఫూర్తి నాటక సమాజం ఓడిపోవాలన్నది వారి ధ్యేయం.

ఆ ప్రయత్నంలో చైతన్య నాటక సమాజం వారికి ఆశాకిరణంలా దొరికాడు ఆనందరావు. ఎంతో శ్రమపడి, కష్టపడి అతని బుర్రలో నాటకం పిచ్చి ఎక్కించారు చైతన్య నాటక సమాజం వాళ్లు.

ఆ నాటి నుండి ఆనందరావు స్ఫూర్తి నాటక సమాజం చుట్టూ వేషాలివ్వమని పగలూ రాత్రి అదే పనిగా తిరిగాడు.

డైరెక్టర్‌కి పిచ్చెక్కి పరిషత్ పోటీకి తయారవుతున్న నాటకంలో చిన్న వేషం ఇచ్చాడు. అది పౌరాణిక నాటకం.

అందులో ఆనందరావుది బ్రహ్మ పాత్ర. ఒకే ఒక్క డైలాగ్ 'భక్తా! ఏమి వరము కావాలో



కోరుకో'' అంతే.

అదే మహా భాగ్యమనుకున్నాడు ఆనందరావు. ఆ డైలాగ్ పేజీలు పేజీలు రాసుకుని ఎన్నో రకాలుగా కంఠస్థం చేసాడు.

ఆనందరావు ఆ డైలాగ్ అదే పనిగా భార్యకి వినిపించేసరికి ఉప్పుకి బదులు పంచదార, పంచదారకి బదులు ఉప్పు, పప్పువేసి గందరగోళ వంట చేసేది.

అయినా పట్టువదలని విక్రమార్కుడిలా ఆ డైలాగ్ వదల్లేదు ఆనందరావు.

అదే డైలాగ్ ఎదురింటి అతనికి తిప్పి తిప్పి చెప్పేసరికి అతనికి మతి పోయినట్లనిపించి వాళ్ల బాబుకి బిస్కట్ ప్యాకెట్టు ఇవ్వడానికి బదులుగా మసాలా పాకెట్టు ఇచ్చాడు. తనేం చేస్తున్నాడో తనకే అర్థం కాని పరిస్థితిలో తల బాదుకున్నాడు.

అంతే... ఇక ఆ వీధిలో వారికందరికీ ఆనందరావంటే భయం పట్టుకుంది. అతను ఎదురుపడితే తప్పించుకోవడం మొదలుపెట్టారు.

★★★

ఆనందరావు ఎంతగానో ఎదురు చూస్తున్న నాటక పోటీలు ప్రారంభమయ్యాయి.

స్ఫూర్తి నాటక సమాజం వారు మేకప్ అవుతున్నారు.

ఆనందరావు వంతు వచ్చింది.

లైట్‌బాయ్‌కి, తోటి పాత్రధారులకి, మేకప్‌మేన్‌కి ఆనందరావు ఆ డైలాగ్‌ని నవవిధాలుగా చెప్పేసరికి మేకప్‌మాన్‌కి మతి తప్పి అటుదిటు ఇటుదటు మేకప్ చేయసాగాడు.

ఎప్పుడూ శాంతంగా ఉండే డైరెక్టర్ డైలాగ్ బాధ భరించలేక అందర్నీ కరచినట్లుగా అరుస్తున్నాడు.

సమాజం వారు ఆలోచించుకుని ముందుగా బ్రహ్మ పాత్రధారుడైన ఆనందరావుకి మేకప్ చేసి అటక ఎక్కించేసారు.

సుమారు రెండుగంటలవరకు మనకి బాధ ఉండదు. మిగతా పనులన్నీ పూర్తయ్యాయి.

నాటకం మొదలయింది.

బ్రహ్మ పాత్ర వచ్చింది.

కమలంలో కూర్చున్న బ్రహ్మని అటక నుండి తాడు సెట్టింగ్‌తో కిందకు దించారు.

ఆ సెట్టింగ్‌ను చూసి ప్రేక్షకులు చప్పట్లతో హోరెత్తించారు.

కిందకి దిగిన బ్రహ్మని చూస్తూ భక్తుడు పాత్రధారి తన్మయత్వంతో పద్యము పాడాడు.

వెంటనే బ్రహ్మ ''భక్తా! ఏమి వరము కావాలో కోరుకో'' అనాలి. కానీ అనలేదు.

మళ్లీ భక్తుడు పాత్రధారి రెండోసారి పద్యము పాడాడు. అయినా బ్రహ్మలో చలనంలేదు.

భక్తుడో మూడోసారి కూడా పద్యము పాడాడు.

జనాల్లో గోల మొదలయింది.

బ్రహ్మ డైలాగ్ కోసం జనం ఈలలేస్తున్నారు.

''మేకప్ చేసే ముందు మా బుర్రలన్నీ తెగ తిన్నావుకదా. ఇప్పుడేమయింది నీకు?'' అంటూ భక్తుడు పాత్రధారి కోపంగా బ్రహ్మ పాత్రలో వున్న ఆనందరావు చెంప ఛెళ్లుమనిపించాడు.

అప్పుడు బ్రహ్మకి రెండువైపులా చెవులకు అడ్డుగా ఉన్న డిప్పలు వూడాయి.

ఇంతవరకూ భక్తుడు పాడిన పద్యము వినబడలేదని తెలిసింది అందరికీ.

ఏనాడూ ఓటమి ఎరుగని స్ఫూర్తి నాటక సమాజం సిగ్గుతో తల దించుకుంది.

మొత్తమ్మీద ఆనందరావు లెగ్ ప్రభావం నాటక సమాజం మీద పడింది. ఇనుప పాదమంటే మాటలా?

మహేశ్వరుడినే పట్టి ఏడు క్షణాలు చెట్టు తొర్రలో దూరే విధం చేసాడు శనేశ్వరుడు. ఆనందరావు రూపంలో నాటక సమాజాన్ని పట్టడం విచిత్రమా?

మన గెలుపుకన్నా ఎదుటివారి ఓటమితో ఎంతో ఆనందం పొందుతున్న ఈనాటి మనుషులూ... మనస్తత్వాలు!

★ఒ

## నిషా కొఠారి ఆనందం



అందాల తార నిషా కొఠారీ తన పేరు ప్రియాంక కొఠారీగా మార్చుకున్నా కూడా ఫలితం అంతంత మాత్రంగానే వుందిట. అయితే తిరిగి చాలా కాలానికి తన గురువు 'వర్మ' సినిమాలో నటించే చాన్స్ రావడంతో ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతోంది ప్పుడు. 'అడవి' సినిమా తన కెరీర్‌ని మరో మలుపు తిప్పేస్తుందని తెగ ఆశతో వుంది ప్రియాంక. ఈ సినిమాలో ప్రియాంక అందాలు కూడా ప్రేక్షకుల్ని కనువిందు చేస్తాయంటున్నారు సినీజనాలు.

